RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 166 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం గురువారం, 19 డిసెంబర్ 2024 పేజీలు : 4 వెల : 2/-




# రేవంత్.. సమరశంఖం

## మణిపూర్ అల్లర్లు - ఆదాని వివాదాలపై రోడ్డెక్కిన టీ కాంగ్రెస్

### చీకటి ఒప్పందంపై నోరు మెదపరేంటని ప్రశ్నించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : దేశాన్ని పట్టి కుదిపేస్తోన్న మణిపూర్ హింసాత్మక పరిస్థితులు, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదాని వివాదాలపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సమర శంఖాన్ని పూరించింది. హైదరాబాద్‌లో భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. ఛలో రాజ్ భవన్ పేరుతో టీపీసీసీ చేపట్టిన ఈ ర్యాలీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ర్యాలీకి నేతృత్వాన్ని వహించారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా రాజ్ భవన్ వరకు చేపట్టిన నిరసన ప్రదర్శన ఇది. రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇందులో పాల్గొన్నారు. ఈ ర్యాలీని పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. దీనితో రేవంత్ రెడ్డి రోడ్డుపైనే బైఠాయించారు. తన నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 75 సంవత్సరాల కాలంలో దేశ ప్రతిష్ఠను కాంగ్రెస్ పార్టీ ఇనుమడింపజేసిందని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, గౌతమ్ అదానీ ఆర్థిక అవకతవకలకు పాల్పడి ప్రపంచం ముందు దేశ పరువు తీశారని ఆరోపించారు. అమెరికాకు సంబంధించిన సంస్థలకు అదానీ లంచాలు ఇచ్చారంటూ ఆ దేశ విచారణ సంస్థలు సైతం నివేదికలు ఇచ్చాయని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయినప్పటికీ- పార్లమెంట్‌లో కనీసం చర్చకు కూడా అవకాశం ఇవ్వట్లేదంటూ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. దేశ పరువు ప్రతిష్టను మంటగలిపిన అదానీపై విచారణ చేపట్టాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో డిమాండ్ చేశారని అన్నారు. అయినప్పటికీ ప్రధాని మోదీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోన్నారని మండిపడ్డారు. అదాని అంశంపై మాట్లాడటానికి అధికార పక్షం ఎందుకు ముందుకు రావట్లేదని నిలదీశారు. అందుకే నేడు దేశ వ్యాప్తంగా రాజ్ భవన్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపునిచ్చిందని రేవంత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వమే ధర్నాకు కూర్చోవడం కొందరికి నచ్చకపోవచ్చని, కొందరికి కడుపులో నొప్పి ఉండొచ్చని చురకలు అంటించారు రేవంత్ రెడ్డి. అదానీ అంశంపై కేసీఆర్, బీఆర్ఎస్.. తమ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తమ వైఖరి ఏమిటో చెప్పకుండా కాంగ్రెస్‌ను అవహేళన చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీతో బీఆరెస్ చీకటి ఒప్పందంలో భాగంగానే ఆదానీపై వారు నోరు మెదపట్లేదని రేవంత్ తేల్చి చెప్పారు. అరెస్టుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీకి బీఆర్ఎస్ లొంగిపోయిందని ఆరోపించారు. అందుకే- ఆదానీపై గురించి మాట్లాడటానికి బీఆర్ఎస్ నేతలు ముందుకు రావట్లేదని అన్నారు. పార్లమెంట్‌లోనూ బీఆర్ఎస్ తమ పార్టీ విధానం ఏమిటో చెప్పాలని, వాళ్లు ప్రజల వైపు ఉంటారా? లేక అదానీ వైపా? అనేది చెప్పాలని రేవంత్ రెడ్డి అన్నారు. ఆదానీపై మాట్లాడితే తమను ఎక్కడ జైలులో పెడతారోననే భయం బీఆర్ఎస్ నేతల్లో ఉందని రేవంత్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమను విమర్శించడం కాదని, ఆదానీపై, జేపీసీపై వైఖరేంటో చెప్పాలని, ఎంపీలతో లేఖ రాయించాలని చెప్పారు. మోదీ, కేసీఆర్ వేర్వేరు కాదని, నాణేనికి బొమ్మ, బొరుసులాంటి వారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. జేపీసీపై డిమాండ్ చేస్తే శాసన సభలో తీర్మానం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశాన్ని దోచుకున్న ఆదానీపై జేపీసీ వేయడానికి ప్రధాని ఎందుకు సిద్ధంగా లేరని, అదానితో లాలూచీ ఏంది అంటూ నిప్పులు చెరిగారు. జేపీసీ వేయకపోతే అవసరమైతే రాష్ట్రపతి భవన్ వద్ద కూడా ధర్నా చేయడానికి తామందరం సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి అన్నారు. తన స్నేహితుడిని కాపాడటానికి ప్రధాని మోదీ శతవిధాలా ప్రయత్నిస్తోన్నారని, అయినా అది సాధ్యం కాబోదని పేర్కొన్నారు.




## టీజీపీఎస్సీ ద్వారా నియామకాలు

### వేములవాడ, ధర్మపురి, కొండగట్టుకు లింకు రోడ్లు

### అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : ఆర్టీసీలో కొత్తగా 3,039 ఉద్యోగాలను టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అసెంబ్లీలో సభ్యులు వివేక్, ఆదిశ్రీనివాస్, పాల్వాయి హరీశ్ తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. జిల్లా కేంద్రాలకు లింక్ రోడ్లు ఏర్పాటు చేయాలని టార్గెట్ పెట్టుకున్నామని తెలిపారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. దీంతో బస్సులకు డిమాండ్? పెరిగిందన్నారు. కొత్త రూట్లను పెంచుతున్నామని చెప్పారు. రాష్ట్రం ఏర్పాటు సమయంలో ఆర్టీసీలో 55వేల మంది ఉద్యోగులు ఉంటే.. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి 40వేల మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. 15 ఏండ్లు దాటిన బస్సును స్క్రాప్‌కు పంపిస్తున్నామని.. కొత్త బస్సులు కొంటున్నామని చెప్పారు. గతంలో 50 శాతం ఆక్యుపెన్సీ ఉండేదనీ, నేడు 100శాతం దాటుతోందని చెప్పారు. వేములవాడ-ధర్మపురి-కొండగట్టు ఆలయాలను కలపుతూ బస్సుల లింకింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కోరుట్ల, జగిత్యాల, సిరిసిల్లలకు బస్సులను పెంచుతామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఎరియర్స్ ఫండ్స్ రూ.280 కోట్లు చెల్లించామనీ, 21 శాతం పీఆర్సీ, కంపాసినేట్ అపాయింట్?మెంట్స్ చేస్తున్నామని తెలిపారు.

**చెన్నూరు డిపో ఏర్పాటుకు టెండర్లు :** చెన్నూరు బస్ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని మంత్రి పొన్నం చెప్పారు. అసెంబ్లీ క్వశ్చన్ అవర్‌లో ఎమ్మెల్యే వివేక్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. చెన్నూరు డిపో కోసం రూ.4 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు.

మెదటి విడతగా కోటి 20లక్షలు చెల్లిచామని, కాంపౌండ్ వాల్, బేస్మెంట్, గ్యారేజీ పనులు పూర్తయ్యాయని తెలిపారు. కానీ ఆర్టీసీకి సంబంధించిన భూమిపై హైకోర్టులో స్టే ఉన్నందున పనులు నిలిచిపోయాయని చెప్పారు. కోర్టులో స్టే వెకేట్ అయిన వెంటనే డిపో ఏర్పాటు చేస్తామని వివరించారు.




హైదరాబాద్: భేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదన్నారు. శాసనసభలో 'భూభారతి' బిల్లును పొంగులేటి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "ధరణితో అనేక మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. ఆ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు వేస్తున్నాం. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టాం. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా నిర్వహించాం. 18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చాం. ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తాం. భూ వివాదాలపై అప్పీలుకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తాం. అనుభవదారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచాం. 33 మాడ్యూల్స్‌తో ఉన్న దాన్ని 6 మాడ్యూల్స్‌తో పునఃప్రక్షాళన చేస్తున్నాం"అని పొంగులేటి తెలిపారు.

# స్వపక్షంలో విపక్షం!

## బీజేపీ హైకమాండ్ గరంగరం!!




## గడువు దాటితే వచ్చే సెషనే!

దిల్లీ: ఎంపీలు ఎంత చెప్పినా మారడం లేదా? వారి కారణంగా మోదీ సర్కార్‌కు టెన్షన్ పట్టుకుందా? కీలకమైన బిల్లు నేపథ్యంలో విప్ జారీ చేసినా, ఎంపీలు ఎందుకు డుమ్మా కొట్టారు? స్వపక్షంలోనే విపక్షం తయారైందా? ఎంపీలపై బీజేపీ హైకమాండ్ ఎందుకు ఆగ్రహం వ్యక్తం చేసింది? మోదీ-అమిత్ షా ద్వయం ఆలోచన ఏంటి? బీజేపీలో మోదీ హవా క్రమంగా తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. ఛరిష్మా కలిగిన నేతలను వెతికే పనిలో పడినట్టు తెలుస్తోంది. రాబోయే ఎన్నికల్లో పాతవారిని పక్కనపెట్టి కొత్తవారికి ఛాన్స్ ఇవ్వాలని ప్లాన్ చేస్తోందట. ఇందుకు కారణాలు అనేకమని చెబుతున్నాయి పార్టీ వర్గాలు. రీసెంట్‌గా వన్ నేషన్- వన్ ఎలక్షన్ బిల్లు నేపథ్యమే దీనికి కారణమని తెలుస్తోంది. శీతాకాల పార్లమెంట్ సమావేశాలు వాడివేడీగా జరుగుతున్నాయి. కీలక బిల్లుల విషయంలో పార్టీ ఎంపీలు కచ్చితంగా సభకు రావాల్సిందేనని విప్ జారీ చేసింది బీజేపీ. అయినా ఎంపీల వైఖరి మారలేదు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లు మంగళవారం లోక్‌సభకు వచ్చింది. బిల్లు పెట్టడానికి ముందు సభలో చిన్నపాటి చర్చ జరిగింది. ఆ తర్వాత బిల్లు సంబంధించి ఓటింగ్ ప్రవేశపెట్టారు న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్. వన్ నేషన్-వన్ ఎలక్షన్ కు బిల్లుకు సంబంధించి సభలో మూడింట రెండొంతుల మెజార్టీ రావాల్సివుంది. లేకుంటే బిల్లు వీగిపోయినట్టేనని ప్రతిపక్షం కాంగ్రెస్ మొదటి నుంచి చెబుతున్నమాట. బిల్లుకు మద్దతుగా 269 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 198 ఓట్లు వచ్చాయి. ఈ లెక్కన ఆ బిల్లును వీగిపోయినట్టే. కానీ బిల్లు పాసైందని లోక్‌సభ ఓకే చేయడం, ఆపై జేపీసీ పంపడం జరిగిపోయింది. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ బిల్లు విషయంలో మోదీ సర్కార్‌కు తగిలిన తొలి దెబ్బ. ఎందుకంటే ఈ బిల్లు పాస్ కావాలంటే కనీసం 360 మంది ఎంపీల మద్దతు తప్పనిసరి. రేపటి రోజు జేపీసీలో సంప్రదింపుల తర్వాత బిల్లు పెట్టినా వీగిపోవడం ఖాయమనే చర్చ ఢిల్లీ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. పరిస్థితి గమనించిన మోదీ సర్కార్, లోక్‌సభకు పార్టీకి చెందిన ఎంతమంది ఎంపీలు హాజరయ్యారు అనేదానిపై లెక్క తీశారు. ఓటింగ్ సమయంలో దాదాపు 20 మంది బీజేపీ ఎంపీలు లేరని తేలింది. వారిలో పలువురు కేంద్రమంత్రులు ఉన్నారు.

గిరిరాజ్‌సింగ్, నితిన్ గడ్కరీ, జ్యోతిరాదిత్య సింధియా, సిఆర్ పాటిల్, శంతను ఠాకూర్, జగదాంబికా పాల్, బీవై రాఘవేంద్ర, విజయ్ బాఘేల్, ఉదయ్‌రాజే భోంసాలే, జగన్నాథ్ సర్కార్, జయంత్‌కుమార్ రాయ్, సోమన్న, చింతామణి మహారాజ్ సభలో లేరని తేలింది. దీనిపై బీజేపీ హైకమాండ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఆయా నేతలతో గతరాత్రి గట్టిగా మాట్లాడినట్టు సమాచారం. ఇదిలావుండగా వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లుకు సంబంధించి 48 గంటల్లోపు జేపీసీ ఏర్పాటు చేయకపోతే ఆ బిల్లు వీగిపోవడం ఖాయమనే చర్చ సాగుతోంది.

బిల్లు ఇప్పుడు వీగిపోతే వచ్చే సెషన్‌లో ప్రవేశ పెట్టాలంటున్నాయి పార్లమెంట్ వర్గాలు. మరో రెండురోజుల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగియనున్నారు. ఈ నేపథ్యంలో మోదీ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## 2024 వెళ్లిపోతోంది..

### మోదీ టూర్ చేసిన దేశాలు మనమూ చూసొద్దామా?

చూస్తూచూస్తూనే 2024 వెళ్లిపోతోంది.. కాలగర్భంలో మరో ఏడాది కలిసిపోతోంది.. మరొక్క రెండు వారాలే..? ఆ తర్వాత 2025. కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ఎంత ఉత్సాహంగా ఉన్నామో.. చెప్పాల్సిన పనిలేదు. అయితే, ఈ సంవత్సరంలో ఒక్క ట్రిప్ అయినా వేయని వారు ఎందరో..? ఏ యిజానికీ తక్కువ కానిదీ టూరిజం.. అందుకే, ఏడాదిలో ఒక్క టూర్ అయినా వేయాలంటారు. తద్వారా మనసు రీచార్జి అవుతుందని చెబుతారు. కానీ, ఎక్కడకు వెళ్లాలి..? ఏ దేశం చూడాలి..? ఏవో ఎందుకు? మన ప్రధాని మోదీ 2024లో పర్యటించిన దేశాలనే మనమూ చుట్టేస్తే..? అసలు ఆ దేశాలేమిటో తెలుసుకుంటే?

దాదాపు 80 దేశాలలో పర్యటించి 2014లో తొలిసారి ప్రధాని అయిన మోదీ ఈ పదిన్నరేళ్లలో దాదాపు 80 దేశాల్లో పర్యటించారు. ఏ భారత ప్రధానీ వెళ్లని మంగోలియా వంటి దేశాల్లోనూ పర్యటించారు. మొత్తమ్మీద మోదీ స్థాయిలో భారత ప్రధానులెవరూ టూర్ చేసి ఉండరనే చెప్పొచ్చు. మరో నాలుగున్నరేళ్ల పదవీ కాలంలో ఆయన ఎన్ని దేశాల్లో టూర్ చేస్తారో..? 2024లో మోదీ వెళ్లొచ్చిన దేశాలేమిటంటే..?

**రెండో నెలలనే..** 2024లోకి అడుగు పెడుతూనే మోదీ తొలి టూర్ చేశారు. ఫిబ్రవరిలో యూఏఈకి వెళ్లారు. పలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇటీవలి కాలంలో పర్యటకపరంగా యూఏఈ బాగా ఆకర్షిస్తోంది. దీంతోపాటు సంస్కరణలతో పెట్టుబడి దారులను ఆహ్వానిస్తోంది. అందుకే, విదేశీ టూర్ చేయాలనుకుంటే ఈ దేశం తొలి ఎంపికగా మారింది. మరీ ముఖ్యంగా అందరూ చూడాలని తపించే దుబాయ్.. యూఏఈలోనిదే.

భారతీయులే కాదు..పలు దేశాలకు చెందిన పర్యాటకులు వెళ్లే దేశం యూఏఈ.


**ప్రశాంత దేశంలో...** ట్రాఫిక్ రణగొణ ధ్వనులకు, సెల్ ఫోన్ భూతానికి దూరంగా.. ప్రశాంత జీవితానికి దగ్గరగా ఉండే బుల్లి దేశం భూటాన్. అక్కడి ప్రజలూ అంతే ప్రశాంతంగా ఉంటారు. ఆ దేశ ప్రధాని షెరింగ్ టోబ్ గే ఆహ్వానంతో మోదీ భూటాన్ వెళ్లారు. మన పక్కనే ఉండే భూటాన్ తక్కువ బడ్జెట్ లో విదేశాలకు వెళ్లాలనుకునేవారికి మంచి ప్రదేశం.. వీసా లేకుండా భారతీయులు 14 రోజులు ఇక్కడ ఉండొచ్చు. అందమైన అడవులు, బౌద్ధారామాలను సందర్శించవచ్చు.

**ఇటలీ రమ్మంటోంది..** యూరప్ ఖండ దేశాల్లో ఇటలీ పర్యటకుల స్వర్గధామం. సినీ తారలు, వ్యాపార దిగ్గజాల ఫేవరెట్ దేశం. డెస్టినేషనల్ వెడ్డింగ్ లకు పెట్టింది పేరు. ఈ దేశంలోని వెనిస్ గురించి ఎంత చెప్పినా తక్కువే. 50వ జీ7 దేశాల సదస్సులో భారత్ కు ఆహ్వానిత దేశం కింద పిలుపు దక్కింది. దీంతో మోదీ ఇటలీలో పర్యటించారు. ఇక ఏటా ఇటలీని లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా ఈ దేశానికి వెళ్లాలనేది టూరిస్టుల లక్ష్యం. రోమ్, ఫ్లోరెన్స్, వెనిస్, అమాల్ఫీ కోస్ట్ తదితర ప్రదేశాలు ఇటలీలో పేరుగాంచినవి.

**చిరకాల మిత్ర దేశం రష్యా..** సోవియట్ యూనియన్ కాలం నుంచి భారత్ కు మిత్ర దేశం. రష్యా తర్వాత కాలంలోనూ అదే స్నేహాన్ని కొనసాగిస్తోంది. 22వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి మోదీ మాస్కో వెళ్లారు. ఏటా ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు రష్యాను సందర్శిస్తుంటారు. భారీ పర్వతాలు, ఎడారులు, అందమైన బీచ్‌లు, వారసత్వ ప్రదేశాలు, రాజ భవనాలు, మంచు సరస్సులకు రష్యా పెట్టింది పేరు. రాజధాని మాస్కో, వ్లడివోస్టాక్ లు పర్యాటకులను బాగా ఆకర్షిస్తాయి.

**సింగపూర్ సిగలో..** నగర దేశం సింగపూర్. మన గ్రేటర్ హైదరాబాద్ కంటే కాస్త పెద్దది అంతే. కానీ, ప్రపంచ దేశాల్లో దీనికి చోటుంది. డెవలప్ మెంట్ లో సింగపూర్ అందరికీ ఆదర్శం. మనకు కాస్త దగ్గర కూడా. మోదీ ఈ ఏడాది సింగపూర్ కూ వెళ్లారు. ఏటా లక్షల మంది సింగపూర్ లో పర్యటన చేస్తుంటారు. మ్యూజియం, జురాంగ్ బర్డ్ పార్క్, రెఫ్లెల్ పార్క్, జూలాజికల్ గార్డెన్, సైన్స్ సెంటర్ సెంటోసా ఐలాండ్, పార్లమెంట్ హౌస్, హిందూ, చైనీస్, బౌద్ధ దేవాలయాలు, చైనీస్, జపనీస్ గార్డెన్లను చూసి మైమరుస్తుంటారు.

# నిధులు రాక.. పనులు సాగక



హైదరాబాద్ :ప్రాజెక్టుల ప్రారంభంలో ఉన్నంత హడావుడి... కేంద్రం నిధులు విడుదల చేసే సమయంలో చూపించదు. నింపాదిగా నిధులు ఇవ్వడంతో పనులు ముందుకు సాగలేకపోతున్నాయి. ముఖ్యమైన నిర్మాణ ప్రాజెక్టులకు రుణాలు మంజూరు కాకపోవడంతో మరికొన్ని ప్రాజెక్టులు పట్టాలెక్కడం లేదు.

**తప్పని జాగు:** మెట్రో మరో దశ ప్రాజెక్టు పనులను మొదలు పెట్టాలన్నా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును వేగంగా ముందుకు కదలించాలన్నా కూడా కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాల్సిందే. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలను ఇస్తున్నారు. వీటిపై కేంద్రం వేగంగా నిర్ణయాలను తీసుకోవడం లేదు.

**ఇదీ కీలకం:** నగరంలోని అన్ని ప్రాంతాలకు మెట్రోను విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. అయిదు కారిడార్లలో 76.4 కి.మీ పొడవున మెట్రో లైను నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందులో కేంద్రం రూ.4230 కోట్లను భరించాలని రాష్ట్రం కోరుతోంది. మిగిలిన మొత్తంలో రూ.7311 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే మరో రూ.1030 కోట్లను నిర్మాణ సంస్థ భరించేలా ప్రణాళికను రూపొందించారు. మిగిలిన మొత్తాన్ని రుణం కింద సమీకరించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం నిర్ణయం తీసుకోలేదు.

**మూసీ ప్రణాళికపై స్పందనేదీ..?**

మూసీ పునరుజ్జీవ పథకంలో నార్సింగి నుంచి బాపూఘాట్ వరకు 22 కి.మీ పొడవున ప్రాజెక్టును మొదలు పెట్టాలని నిర్ణయించారు. స్మారక మందిరంతోపాటు అతి పెద్ద బాపూ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తలపెట్టారు. ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకు రెండు రకాల అనుమతులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రాంతంలో రక్షణ శాఖకు 222 ఎకరాలు ఉంది. ప్రత్యామ్నాయ ప్రణాళికతో రక్షణ శాఖకు చేసిన ప్రతిపాదనలపై స్పందన లేదు. ప్రాజెక్టు వ్యయంలో రూ.3500 కోట్లను కేంద్రం ఇవ్వాలని రాష్ట్రం కోరుతోంది. దీనిపై ఇంకా నిర్ణయం రాలేదు.


రాజధానిలో మురుగు రోడ్లపైకి రాకుండా ఉండాలంటే బల్దియా పరిధిలో 2600 కి.మీ కొత్త డ్రైనేజీ వ్యవస్థను రూపొందించాలని నివేదికను రూపొందించింది. బాహ్యవలయ రహదారి వరకు మరో 4600 కి.మీ మేర కొత్తగా భూగర్భ డ్రైనేజీతోపాటు మురుగు శుద్ధి కేంద్రాలను రూపొందించాలని కోరింది. దీనికి రూ.17,212 కోట్ల వ్యయం అవుతుంది. ఇందులో 50 శాతం నిధులు భరించాలని కేంద్రాన్ని కోరింది.

రాష్ట్ర, జాతీయ రహదారులపై రెండు ఆకాశమార్గాల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చినా.. వీటికి రుణం మంజూరు కాకపోవడంతో ఇంకా పనులు మొదలుకాలేదు.

ఒకటి సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి తాడ్‌బండ్ జంక్షన్, బోయినపల్లి జంక్షన్ మీదుగా నిర్మాణానికి రూ.1580 కోట్లు అవుతుంది.

ప్యారడైజ్ నుంచి తూముకుంట వరకు ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.2,232 కోట్లు కావాలి. ఇప్పటి వరకు ఏ సంస్థతోనూ నిధులకు ఒప్పందం చేసుకోలేదు.

# బంధువులుగా చేరి.. పెళ్లింట చోరీ



హైదరాబాద్ : కాఫీలు తాగారా.. టిఫిన్‌లు చేశారా! ఒక సినిమాలో పెళ్లింట ఆహ్వానం పలుకుతూ ఆత్మీయత ఒలకబోస్తారు. చివర్లో విలువైన వస్తువులు కొట్టేసే దొంగలుగా బయటపడతారు. అలా వెండితెరపై నవ్వించిన పాత్రలు.. ప్రస్తుతం వివాహాది శుభకార్యాలు జరుగుతున్న చోటికి చేరి అదను చూసి అందినంత కాజేసి మాయమవుతున్నారు. షేక్‌పేట్‌లోని ఓ ఫంక్షన్ హాలులో వివాహ వేడుకలో అందరూ హడావుడిగా ఉన్నారు. అక్కడ ఇద్దరు మహిళలు చక్కగా ముస్తాబై పెళ్లికూతురి గదిలోకి వెళ్లి కొద్దిసేపయ్యాక బయటకు వచ్చారు. ఆ తర్వాత ఆ గదిలో బంగారు నెక్లెస్ మాయమైనట్టు గుర్తించారు. సీసీటీవీ కెమెరా ఫుటేజీలో ఆ ఇద్దరు మహిళలు హడావుడిగా బయటకు వెళ్లినట్టు కనిపించారు. తాజాగా ఆసిఫ్‌నగర్‌లో వివాహం జరిగే ఇంట 20తులాల బంగారం మాయమైంది. కుటుంబసభ్యులు పెళ్లిపనుల్లో నిమగ్నమై ఉండటాన్ని ఆసరాచేసుకొని దగ్గరి బంధువులే చోరీకి పాల్పడినట్టు గుర్తించిన పోలీసులు నిందితులనుఅరెస్ట్ చేశారు.

**ఆత్మీయులుగా నటిస్తూ..**

కొద్దిరోజులుగా మహానగరంలో ఎటుచూసినా పెళ్లిసందడే. ఖరీదైన ఇంట వివాహమంటే వారంరోజుల ముందు నుంచే హంగామా.. అక్కడికి వచ్చిన వారిలో బంధుమిత్రుల ఎవరనేది గుర్తించటం సవాల్. వధూవరుల కుటుంబసభ్యులు పెళ్లి పనుల్లో బిజీగా ఉంటారు. అక్కడక్కడ ప్రైవేటు భద్రతా సిబ్బంది ఉన్నా చూసీచూడనట్టు వదిలేస్తారు. దీన్ని అవకాశం చేసుకున్న మాయగాళ్లు తెలివిగా వివాహ మండపం వద్దకు చేరుతున్నారు. అతిథులు మాదిరిగానే పెళ్లిపీటలపై వధూవరులను ఆశీర్వదిస్తారు. కడుపారా భోజనంచేసి నెమ్మదిగా చేతివాటం ప్రదర్శిస్తారంటూ నగరానికి చెందిన ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తాజాగా దక్షిణమండలం పరిధిలో వ్యాపారి కుమారుడి వివాహం జరిగింది. వరుడి మిత్రుడినంటూ చేరిన ఓయువకుడు.. ఇద్దరు సెల్‌ఫోన్లు కొట్టేసి మాయమయ్యాడు. ఆదిభట్ల పరిధిలో ఫంక్షన్‌హాలులో జరిగినపెళ్లిలో రూ.40వేల నగదు, 20తులాల బంగారు నగలున్న బ్యాగు మాయమైంది. మధ్యప్రదేశ్, యూపీ, మహారాష్ట్రకు చెందిన కొన్ని ముఠాలు బంధువులుగా చేరి చోరీలకు పాల్పడుతున్నట్టు పోలీసులు భావిస్తున్నారు.

**బంగారు నగలు.. సెల్‌ఫోన్లు**

గతంలో అంతరాష్ట్ర దొంగ ఫంక్షన్‌హాళ్లలో పనివాడిగా చేరి చోరీలకు పాల్పడ్డాడు. అందరూ పెళ్లిపనుల్లో ఉంటే ఇతడు వధువు, వరుల గదుల్లోకి వెళ్లి విలువైన ఆభరణాలు కాజేసి మాయమయ్యేవాడు. వాటిని రిసీవర్‌కు అప్పగించి

మరో ప్రాంతాన్ని ఎంచుకునేవాడు. నగరం, శివారు ప్రాంతాల్లో సుమారు 20కు పైగా చోరీలకు పాల్పడిన ఇతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా వేడుకల్లో హల్‌చల్ చేస్తున్న ముఠాలు స్వర్ణాభరణాలు, సెల్‌ఫోన్లు లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేస్తున్నాయని సైబరాబాద్‌కు చెందిన ఒక ఏసీపీ తెలిపారు. ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులకు ముందుగానే సమాచారం ఇచ్చామని.. కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని చెప్పినట్టు వివరించారు.

# జనం చూపు జనరిక్ వైపు.. 80 శాతం వరకు రాయితీతో ఔషధాలు



హైదరాబాద్ : జనరిక్ మందులకు (%Generic Medicine%) ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వ దవాఖానాల వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద రోగుల రద్దీ కన్పిస్తోంది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల నుంచి నిత్యం వందలాది మంది రోగులు మందులు కొనుగోలు చేస్తున్నారు. తాజాగా పార్లమెంట్‌లో కేంద్రం సమర్పించిన నివేదికలో సరాసరి రోజూ 77 మంది జనరిక్ ఔషదాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపింది. బ్రాండెడ్ మందుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మున్ముందు జనరిక్‌కు ఆదరణ పెరగనుంది.

**బ్రాండ్ లేకుండా.. తక్కువకే**

సాధారణ జ్వరం వస్తే వినియోగించే ఔషధం పారాసిటమాల్. వైద్యుడి దగ్గరకు వెళ్తే మందుల చిట్టీలో ఇది కాకుండా ఏదో ఒక బ్రాండ్ పేరు రాస్తారు. మందుల దుకాణానికి వెళ్లి అదే బ్రాండ్ మందు తీసుకొని వాడుకోవడం అందరమూ చేస్తుంటాం. వాస్తవానికి పారాసిటమాల్ అనేది జనరిక్ పేరు. బ్రాండ్ లేకుండా అతి తక్కువ ధరకే జన ఔషధ షాపుల్లో పొందే వీలు ఉంటుంది.

పేదలకు భరోసా...: గాంధీ, ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల రద్దీ ఇతరత్రా కారణాలతో కొన్ని మందులు లభించడం లేదు. ఆరు మందులు రాస్తే.. నాలుగే ఇస్తున్నారు. మిగతావి బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఉస్మానియా, గాంధీలో ప్రైవేటు మెడికల్ షాపులు రోజుకు రూ.2-3 లక్షలు వరకు మందులను విక్రయిస్తున్నారు. ఈ తరుణంలో పేద రోగులకు జనరిక్ ఔషద దుకాణాలు ఆదుకుంటున్నాయి.

**ధరల్లో భారీ వ్యత్యాసం...**

సాధారణ బ్రాండెడ్ మందులకు జనరిక్ ఔషధాలకు ధరల్లో ఎంతో వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు నొప్పి నివారణకు వాడే ఒక ప్రముఖ బ్రాండ్ 10 మాత్రలు రూ.55-70 పైనేమాటే. అదే 10 మాత్రలు జనరిక్ స్టోర్‌లో కేవలం రూ.10-15 లోపే. ఇక 100 ఎంఎల్ దగ్గు సిరప్ బ్రాండ్‌ది అయితే రూ.50-60 వరకు ఉంటుంది. అదే జనరిక్‌లో కేవలం రూ.20లోపే లభిస్తుంది. కొన్ని రకాల మందులైతే 80 శాతం తక్కువకే లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం రోగుల చికిత్సకు అయ్యే వ్యయంలో 40-50% వరకు ఔషధాల ఖర్చు ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్యులు సైతం జనరిక్ మందుల వాడే విధంగా రోగులను ప్రోత్సహించాల్సి ఉంది.

# దళిత సంఘాల ఆధ్వర్యంలో అమిత్ షా చిత్రపటం దగ్ధం

ఇంద్రవెల్లి : రాజ్యసభలో భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో దేశ హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యాంగ రూపశిల్పి బి.ఆర్ అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారె కాంరాజ్ అన్నారు. బుధవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశానికి దిక్సూచి అయిన భారత రాజ్యాంగ రూపశిల్పి పరమ పూజ్య భారతరత్న డా.బాబాసాహెబ్ అంబేద్కర్ ను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదని పేర్కొన్నారు.ఆర్ఎస్ఎస్ భావజాలంతో బీజేపీ



దేశాన్ని సర్వనాశనం చేస్తోందని,సావర్కర్ ఐడియాలాజీ ఈ దేశంలో చెల్లదన్నారు.హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు తానే పూర్తి బాధ్యత వహిస్తూ...తన పదివికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.లేని యెడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భీం ఆర్మీ నాయకులు, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నాయకులు, బహుజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చలో రాజ్ భవన్ ర్యాలీలో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఉట్నూర్ డిసెంబర్ 18(ప్రభాత సమాచారం )**

దేశంలో ఆర్థిక వ్యవస్థను కొల్లగొట్టడంలో ప్రధాన భూమికను పోషిస్తున్న బడ ఆర్థికవేత్త ఆధాని ఆర్థిక అవకతవకలు, మణిపూర్ హింసాత్మక ఘటనలపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహించడం పట్ల, అధాని ను అరెస్ట్ చేయకపోవడాన్ని నిరసిస్తూ... హైదరాబాద్ లోని నెక్లెక్స్ రోడ్డు నుండి రాజ్ భవన్ వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి,టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్ భవన్ ర్యాలీలో ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్ భవన్ వద్ద చేపట్టిన నిరసనలో రోడ్డుపై బైఠాయించారు.ఆదానిను అరెస్ట్ చేయాలనీ,మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఇందులో మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఉర్దూ మీడియం విద్యార్థులపై వివక్ష..స్పందించిన రాష్ట్ర మైనార్టీ కమిషన్

### జిల్లా విద్యాశాఖ అధికారికి నోటీసులు జారీ

**నిర్మల్ డిసెంబర్ 18(ప్రభాత సమాచారం)**

ఈనెల 11న నిర్వహించిన గణిత జిల్లా స్థాయి టాలెంట్ పరీక్షలకు జిల్లాలోని ఉర్దూ మీడియం విద్యార్థులకు అవకాశం ఇవ్వకుండా కేవలం ఇంగ్లీష్ ,తెలుగు మీడియం విద్యార్థులకు మాత్రమే అవకాశం ఇవ్వడం పట్ల సర్వత్ర నిరసనలు వచ్చాయి . జిల్లా విద్యాశాఖ అధికారి ఇచ్చిన ఉత్తర్వులకు భిన్నంగా ఉర్దూ మీడియం విద్యార్థులకు టాలెంట్ పరీక్షకు దూరంగా పెట్టడాన్ని జిల్లా మేవా ,టీఎస్ పి టి ఎ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది . అయినను ఎలాంటి చర్యలను తీసుకోకపోవడంతో రాష్ట్ర మైనార్టీ కమిషన్కు ఫిర్యాదు చేయడం జరిగింది . దీంతో స్పందించిన రాష్ట్ర మైనార్టీ కమిషన్ వచ్చే నెల 2వ తేదీలోగా పూర్తి నివేదికను సమర్పించాలంటూ రాష్ట్ర ఎస్సీ ఆర్ టి డైరెక్టర్ కు ,జిల్లా విద్యాశాఖ అధికారికి ,జిల్లా కలెక్టర్కు నోటీసులు జారీ చేసింది .అంతేకాకుండా గణిత టాలెంట్ పరీక్షకు ఉర్దూ మీడియం విద్యార్థులకు అవకాశం ఇవ్వని ఫోరం బాధ్యులకు కూడా నోటీసులు జారీ చేసింది

# నిర్వహణ కొరవడి.. సమస్యల ఒరవడి

కొడంగల్ :ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని ముడిమ్యాలలో ఏడేళ్లుగా ఓ అద్దె భవనంలో కొనసాగుతోంది. అంతకుముందు ఆ భవనంలో ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల ఉండేది. అది మూతపడడంతో భవనాన్ని అద్దెకు తీసుకొని గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు. అందులోనే ఇంటర్ కళాశాల కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 532 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. అయితే అద్దె భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ నెట్టుకొస్తున్నారు. తరగతి గదుల గోడలు బీటలు వారడంతో పాటు ఫ్లోర్ టైల్స్ పగిలిపోయాయి. కిటికీలకు అద్దాలు లేవు. చాలినన్ని మరుగుదొడ్లు లేవు. ఉన్న వాటి తలుపులు విరిగిపోయాయి.మురుగు వ్యవస్థ లేకపోవడంతో ఆవరణలోనే ఓ గుంత తీసి అందులోకి వదులుతుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని భవన యజమాని దృష్టికి తీసుకెళ్తే.. మరమ్మతులు చేయించలేనని.. ఖాళీ చేయాలని చెబుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. సమస్యను సాంఘిక సంక్షేమ గురుకులాల ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లామని చెబుతున్నారు. 500 మందికి పైగా విద్యార్థులు ఉండటంతో వారికి సరిపడా అద్దె భవనం ఎక్కడా దొరకడం లేదని అధికారులంటున్నారు. గురుకుల ప్రిన్సిపల్ పాండు నాయక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి మరో భవనంలోకి మార్చితే బాగుంటుందని ఆయన తెలిపారు.

# నిర్దేశిత సమయంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**గంభీరావుపేట (సిరిసిల్ల) డిసెంబర్ 18(ప్రభాత సమాచారం)**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్దేశిత సమయంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై సంబంధిత అధికారుల, పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా ఇందిరమ్మ ఇండ్ల కోసం మనకు 1లక్షా 7వేల 398 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు వీటిలో 15వేల 510 దరఖాస్తుదారుల ప్రస్తుత నివాసం ఇందిరమ్మ యాప్ లో క్యాప్చర్ చేయడం జరిగిందని అన్నారు. ప్రతి రోజూ పంచాయతీ కార్యదర్శి 25 ఇండ్లు మేరకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలని, గ్రామాల్లో అవసరమైతే అదనపు లాగిన్లు తీసుకుని సర్వే వేగవంతం కావాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం జిల్లాలోని మండలాల్లో వివిధ గ్రామాల్లో జరుగుతున్న సర్వే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సెల్ టవర్ నెట్వర్క్ ప్రాబ్లమ్స్ ఎదురైతే ఆఫ్ లైన్ ద్వారా కూడా నమోదు చేయవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని, నిర్దేశిత సమయం డిసెంబర్ 31 లోగా సర్వే పనులు పూర్తి కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్చార్జి జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, ఎం.పి.డి.ఓ లు, పంచాయితి కార్యదర్శులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా






**గంభీరావుపేట(సిరిసిల్ల) డిసెంబర్ 18(ప్రభాత సమాచారం):**
మాదకద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ అఖిల్ మహాజాన్ తో కలిసి సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామస్థాయి నుంచి డ్రగ్స్, గంజాయి సమస్య పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్ గురించి ఫీల్డ్ లెవల్ నుంచి సమాచారం అందాలని, ప్రతి గ్రామం నుంచి పంచాయతీ కార్యదర్శి గంజాయి సమస్య పరిష్కారం పై సమాచారం అందించాలని, గ్రామంలో ఎవరు గంజాయి కి బానిసలు అవుతున్నారు మొదల వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. గంజాయి సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని, మీ వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో డ్రగ్స్, గంజాయి నివారణ పై వ్యాస రచన పోటీలు, పేయింటింగ్ పోటీలు ప్రతి నెలా నిర్వహించాలని అన్నారు. డ్రగ్స్ నియంత్రణ పై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు జిల్లాలో సంబంధిత శాఖ అధికారులను పక్కా కార్యాచరణతో కృషి చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా బెల్ట్ షాపు లు ఉంటే జిల్లా ఎక్సైజ్ అధికారి 8712658827 నెంబర్ కు సమాచారం అందించాలని, బెల్ట్ షాపులను తొలగించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. విద్యా సంస్థల్లో నిర్వహించే పేరెంట్ టీచర్స్ సమావేశాలలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే వచ్చే పరిణామాలు, మాదకద్రవ్యాల బానిసత్వం నివారణకు ప్రభుత్వం సిరిసిల్ల రాజీవ్ నగర్ బస్తీ దవఖానలో ఏర్పాటు చేసిన డి అడిక్షన్ సెంటర్ మొదలగు అంశాలను వివరించాలని, పేరెంట్స్ చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలని కలెక్టర్ సూచించారు.డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాల పై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజాన్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో డ్రగ్స్ మాదకద్రవ్యాల నియంత్రణకు పక్కా నిఘా ఏర్పాటు చేశామని, గత సంవత్సర కాలంగా మాదకద్రవ్యాలకు సంబంధించి 95 కేసులో నమోదు చేసి దీనికి సంబంధించిన 214 పైగా వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. డ్రగ్స్ నివారణ కోసం సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు .మాదక ద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్, గుడెంబా సంబంధించి పౌరులకు ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656426 కు తెలియజేయాలని , సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి డ్రగ్స్, గంజాయి అలవాటు ఉన్నట్లు ఏదైనా అనుమానం కలిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని, మా దగ్గర అవసరమైన మేర డ్రగ్స్ నిర్ధారణ కిట్లు, నార్కోటిక్స్ గుర్తించే డాగ్స్ అందుబాటులో ఉన్నాయని వెంటనే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్.డి.ఓ. సిరిసిల్ల వెంకట ఉపేందర్ రెడ్డి, ఇన్చార్జి డి.పి.ఓ. శేషాద్రి, డి.ఏ.ఓ. అఫ్జలి బేగం, డి.ఐ.ఈ.ఓ. శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి పంచాక్షరి, విద్యా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టాలెంట్ పరీక్ష

## ఎంపికైన విద్యార్థులకు బహుమతులు ప్రశంసా పత్రాలు



**నిర్మల్ డిసెంబర్ 18(ప్రభాత సమాచారం)**
జిల్లా సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి బయో సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు . అన్ శృత రెసొనెన్స్ ఐఐటి నీట్ అకాడమీ సౌజన్యంతో నిర్వహించిన ఈ టాలెంట్ పరీక్షకు జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల నుండి విద్యార్థులు హాజరయ్యారు .హాజరైన తెలుగు, ఉర్దూ , ఆంగ్ల మాధ్యమాల విద్యార్థులకు ఈ టాలెంట్ పరీక్ష నిర్వహించారు .మాధ్యమాలవారీగా మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ , ద్వితీయ బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు . ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి బయోసైన్స్ టాలెంట్ పరీక్షకు హాజరవుతారని నిర్వాహకులు వెల్లడించారు . ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం అధికారిని సిద్ధ పద్మ , సెక్టోరల్ అధికారిని సలోమికరణ ,ఏ ఎం ఓ నరసయ్య ఎస్వోలు లింబాద్రి , ప్రవీణ్ , జిల్లా సైన్స్ అధికారి వినోద్ , రీసోనేన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ లావణ్య ,సైన్స్ ఫోరం అధ్యక్ష కార్యదర్శులు సుష్మారాణి , సత్తన్న మోహన్ రావు ,గంగా సురేష్ ,సుదర్శన్ ,జెడ్ హెచ్ మసూద్ ,జీవశాస్త్ర ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వం దేశ ఔన్నత్యానికి నిదర్శనం





**ఆదిలాబాద్ డిసెంబర్ 18(ప్రభాత సమాచారం)**
భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ ఔన్నత్యానికి నిదర్శనమని దారుల్ ఆన్సర్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖుద్దూస్ పేర్కొన్నారు. బుదవారం పట్టణంలోని ఆర్ఫా గార్డెన్ లో సర్వమత సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు పలు అంశాలపై ప్రసంగించారు. అనంతరం చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నిరుపేదలకు దుప్పట్లు పంపిణి చేసి మానవత్వాన్ని చాటారు. ఈమేరకు దారుల్ అన్సర్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ.... యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలని సూచించారు. భిన్నత్వంలో ఏకత్వమే భారత దేశ బలమని, అందుకే ప్రపంచ దేశాల్లో గౌరవాన్ని పొందుతున్నామని అన్నారు. పరమత సహనం పాటించాలన్నారు. ఏ వర్గం వారైనా వారి ఆకలి తీర్చడం కనీస ధర్మమని పేర్కొన్నారు. సమాజ హితం కోసం ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో హాఫీజ్ రిజ్వాన్, ఖాజీ నదిముద్దిన్, పైసల్ బిన్, భావన, బండారి దేవన్న, ఫాదర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు అవసరమే..!

## జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మాద్





**నిర్మల్ డిసెంబర్ 18(ప్రభాత సమాచారం)**
విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మూడవ రోజు కొనసాగుతున్న సీఎం కప్ పోటీలను సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ సీఎం కప్ పోటీలు దోహదపడతాయని తెలిపారు. అన్ని రంగాల్లో విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ తత్వం ఉండాలన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది తెలిపారు. క్రీడాకారులంతా జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి, రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడల్లో స్థానం సంపాదించాలని ఆకాంక్షించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మూడవ రోజు జరుగుతున్న పోటీలను జిల్లా జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, పలువురు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి గంగారెడ్డి, క్రీడాకారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# హొటల్ తాజ్ కృష్ణా లో సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్



**హైదరాబాద్ డిసెంబర్ 18(ప్రభాత సమాచారం)తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం హైదరాబాద్ లోని తాజ్ కృష్ణా హొటల్ లో ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు విందు ఇచ్చారు. విందులో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కూడ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే వెడ్మ భోజ్జుపటేల్‌ను ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలు తెలుసుకొన్నారు.**

# బడి బయట విద్యార్థుల గుర్తింపుకు ప్రత్యేక సర్వే

## అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**గంభీరావుపేట(సిరిసిల్ల) డిసెంబర్ 18(ప్రభాత సమాచారం):**
బడి బయట ఉన్న విద్యార్థుల గుర్తింపుకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా విద్యాశాఖ , కార్మిక శాఖ, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ , పోలీసు శాఖలతో అదనపు కలెక్టర్ బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఈ నెలలో చేపట్టనున్న బడి బయటి విద్యార్థుల సర్వే పై ప్రత్యేక సూచనలు చేశారు. ప్రతి పాఠశాలలో ఒక నెల కంటే ఎక్కువగా గైరహాజరు అయిన విద్యార్థులను గుర్తించి వారిని బడి బయట విద్యార్థులుగా ( ఓ ఎస్ సీ ) గుర్తించాలనిహొ తెలిపారు. 15 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న విద్యార్థులు విద్యను ఆపివేస్తే వారికి ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా విద్యాభ్యాసం కొనసాగించడానికి ప్రేరేపించాలని సూచించారు. విద్యార్థులు బడికి రాకపోవడానికి గల కారణాలను తెలుసుకోవాలని, అలాగే విద్యార్థులందరినీ పాఠశాలలు ఆకర్షించే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరము బడిబాటి విద్యార్థుల గుర్తింపుకు సర్వే నిర్వహిస్తారని, అది డిసెంబర్, జనవరి నెలల్లో నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు.హొ ఉపాధ్యాయులు, అధికారులు సంబంధిత ఆవాసములో ఉండే తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, యువజన సంఘాలు, భాగస్వాములు చేసుకోవాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కూడా వీరికి సహకరించాలని ఆదేశిం చారు. సర్వే చేపట్టే విధానం, దానికి అవసరమైన ప్రొఫార్మాలను, సూచనలను జిల్లా విద్యాశాఖ అధికారి ఈ సమావేశంలో ఇతర అధికా రులకు తెలియజేశారు. ఇటుక బట్టి ప్రాంతాలను, పని ఆవాసాలను, వలస వచ్చే కార్మికులు ఎక్కువగా ఉండే ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రత్యేక సర్వే చేయాలని సూచించారు. గత ఏడాది దాదాపు 420 మంది గుర్తించి సమీప స్కూళ్లు, వర్క్ సైట్ స్కూల్ లలో చేర్పించామని వివరించారు. ఇక్కడ జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే ఆ పని చెయ్.. కేటీఆర్ సవాల్..







## ఫార్ములా ఈ రేస్‌పై రేవంత్‌కు కేటీఆర్ సవాల్...

హైదరాబాద్, డిసెంబర్ 18: ఫార్ములా ఈ రేస్ వ్యవహారానికి సంబంధించి వస్తున్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాసిన మాజీ మంత్రి.. దమ్ముంటే ఫార్ములా- ఈ రేస్ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ రేస్‌పై రకరకలా వార్తలు వస్తున్నాయని.. ముఖ్యంగా తన గురించి ఆరోపణలు వస్తున్నాయన్నారు.

ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలోనే ఈ అంశంపై చర్చ కూడా జరిగినట్లు తెలిసిందన్నారు. హైదరాబాద్‌కు మంచి జరగాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా ఈ రేస్ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కానీ రాజకీయ కక్షలకు బలి చేశారని మండిపడ్డారు. మొదటి దఫా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో విజయవంతంగా జరుగగా.. రెండో దఫాలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏకపక్షంగా రద్దు చేశారని మండిపడ్డారు.

రాష్ట్ర ప్రజలు నిజాలు తెలుసుకునే హక్కు ఉన్నందున ఈ అంశాలన్ని శాసనసభలో చర్చ పెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**కేటీఆర్ లేఖ ఇదే..** “ఫార్ములా - ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార అరోపణలు చేస్తోంది. ఇదే విషయం మీద ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు ఇస్తున్నారు. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసనసభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయి. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా- ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకుంది.

2023లో విజయ వంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకుంది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ది చేకూరింది అని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది” అని మాజీ మంత్రి అన్నారు.

## రేవంత్ చేతికి బ్రహ్మాస్త్రం - కేటీఆర్ “ఫిక్స్”..!!

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి కర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఏడాది పాలన పూర్తి చేసుకున్న రేవంత్ ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోంది. పాలనలో .. రాజకీయంగా నూ కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. రెండు కేసుల్లో మాజీ సీఎం కేసీఆర్ .. మాజీ మంత్రి కేటీఆర్ కు ఉచ్చు బిగుస్తోంది. ఇక, ప్రభుత్వంలో తాజాగా అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. కేటీఆర్ ఫిక్స్ అయినట్లు కనిపిస్తోంది. తరువాతి నిర్ణయాల పై ఆసక్తి కొనసాగుతోంది.

**సీఎస్ లేఖతో...** మాజీ మంత్రి కేటీఆర్ కు ఉచ్చు బిగుస్తోంది. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసు వ్యవహారంలో తాజా పరిణామంతో ఆసక్తి కర పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ అంశంలో ఇప్పటి కే గవర్నర్ విచారణకు అనుమతి ఇచ్చారు. దీంతో, ఈ కేసులో లోతుగా దర్యాప్తు చేయాలని కోరుతూ ఏసీబీకి తెలంగాణ సీఎస్ శాంతికుమారి లేఖ రాశారు. గవర్నర్ ఇచ్చిన అనుమతిని సీఎస్ తాను రాసిన లేఖకు జత చేసి ఏసీబీకి పంపించారు. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో నిధుల దుర్వినియోగంపై పూర్తి విచారణ జరపాలని సీఎస్ కోరారు.

**విచారణ షురూ...** ఈ లేఖలో సీఎస్ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ నిర్ణయాలు.. అనుమతులు.. పూర్వాపరాలు.. నిర్వహణ విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ తీసుకున్న చర్యల పైనా సమగ్ర దర్యాప్తు చేయాలని సీఎస్ సూచించారు. ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ కరెన్సీ చెల్లింపు పైన అభియోగాలు ఉన్నాయి. ప్రజాధనం దుర్వినియోగం చేసారనేది ప్రధాన ఆరోపణ. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ చెల్లింపులు చేయటం పైన పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరారు. ఇదే కేసులో ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు అధికారులు ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్నారు.

**వాట్ నెక్స్ట్...** అయితే, ఈ కేసులో కేటీఆర్ ను ఏ -1 గా చేర్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. ఇప్పుడు సీఎస్ లేఖతో ఏసీబీ విచారణ ప్రారంభించే అవకాశం ఉంది. అందులో భాగంగా రూ.55 కోట్ల ఫార్ములా-ఈ నిధుల దుర్వినియోగం కేసులో విచారణకు తమ ముందు హాజరు కావాలంటూ ఏసీబీ కేటీఆర్‌కు నోటీసులు పంపనుంది. తాజాగా ఏసీబీ అధికారులు కేటీఆర్ కేసుకు సంబంధించిన వివరాలను సీఎంకు వివరించినట్టు సమాచారం. దీంతో... ఇప్పుడు ఈ కేసులో ఏసీబీ తీసుకునే నిర్ణయాలు.. జరిగే పరిణామాల పైన రాజకీయంగా ఉత్కంఠ కొనసాగుతోంది.

## ‘మూసీ’పై అబద్ధాలు ఎందుకు.. ఎవరి లాభం కోసం?: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: భారాస సభ్యులు మండలిలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తప్పుడు సమాధానాలు ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్ ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు సభను తప్పుదోవ పట్టించారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కవిత మాట్లాడారు. “మూసీ ప్రాజెక్ట్ కోసం ప్రపంచ బ్యాంకు రుణం అడగలేదని శ్రీధర్‌బాబు చెబుతున్నారు. సెప్టెంబర్‌లో రుణం అడిగినట్లు సాక్ష్యాధారాలు బయటపెడుతున్నాం. డీపీఆర్ లేదని అసెంబ్లీలో చెబుతున్నారు. ప్రపంచబ్యాంకుకు సెప్టెంబర్ 19న ఇచ్చిన నివేదికలో డీపీఆర్ ఉందని పేర్కొన్నారు. అబద్ధాలు ఎందుకు? ఎవరి లాభంకోసం ఇదంతా చేస్తున్నారు? ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. భారాస అధికారంలో ఉండగా ప్రపంచ బ్యాంకును తెలంగాణలో అడుగుపెట్టనివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్‌కార్పెట్ వేస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా రూ. 14వేల కోట్ల సాయం అడిగారు. మూసీ ప్రాజెక్టుపై అబద్ధాలు చెబుతున్న ఈ ప్రభుత్వాన్ని వదిలి పెట్టే ప్రసక్తే లేదు” అని కవిత అన్నారు.

## అసెంబ్లీ బయట డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు పెట్టాలి.. హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు.

## జేపీసీకి జమిలి.. కమిటీలో ప్రియాంక గాంధీ..!

దిల్లీ: దేశవ్యాప్తంగా ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు వీలుగా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జమిలి ఎన్నికల రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రతిపక్షాల డిమాండ్‌తో ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి (జేపీసీ) పంపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును పరిశీలించే జేపీసీ నామినీ జాబితాలో కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ పేరు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆమెతో పాటు కాంగ్రెస్ నుంచి మనీశ్ తివారీ, రణ్‌దీప్ సూర్జేవాలా, సుఖ్‌దేవ్ భగత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. ఈ కమిటీలో సభ్యులుగా కల్యాణ్ బెనర్జీ, సాకేత్ గోఖలేల పేర్లను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. కాగా.. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు అనువుగా 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టింది. 90 నిమిషాల చర్చ అనంతరం ఓటింగ్ జరగ్గా బిల్లుకు అనుకూలంగా 269 మంది.. వ్యతిరేకంగా 198 మంది ఓటేశారు. దీంతో బిల్లును ప్రవేశపెట్టడానికి స్పీకర్ ఓం బిర్లా ఆమోద ముద్ర వేశారు. అయితే.. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున జేపీసీకి పంపాలని డిమాండ్ చేశాయి. దీంతో ఈ బిల్లును జేపీసీకి పంపారు. ఈ కమిటీలో ప్రియాంక గాంధీ కూడా సభ్యురాలు కానున్నట్లు తెలుస్తోంది.

## భారాస పాలనలో రహదారులను విధ్వంసకరంగా మార్చింది: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




భారాస పదేళ్ల పాలనలో రహదారులను విధ్వంసకరంగా మార్చిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో మట్టి రోడ్డు లేకుండా చేస్తామన్న కోమటిరెడ్డి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పనులను వేగవంతం చేశామని తెలిపారు.

ప్రతి గ్రామం నుంచి మండలం వరకు సింగిల్ బీటీ రోడ్డు, మండల కేంద్రం నుంచి జిల్లాకు వెళ్లేందుకు డబుల్ బీటీ రోడ్డు వేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయన మాట్లాడారు

## కాళేశ్వరంపై కీలక విషయాలు బయటపెట్టిన రిటైర్డ్ ఐఏఎస్

హైదరాబాద్, డిసెంబర్ 18: కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు, మేడిగడ్డ కుంగుబాటుపై కాళేశ్వరం కమిషన్ విచారణ కొనసాగుతోంది. ఈరోజు (బుధవారం) నుంచి రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, రిటైర్డ్ ఇంజనీర్లతో ప్రస్తుత ఐఏఎస్ అధికారులను కమిషన్ విచారించనుంది. అందులో భాగంగా ఈరోజు పలువురు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు కమిషన్ ముందు హాజరయ్యారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఎస్‌కే జోషి, నీటిపారుదల శాఖ కార్యదర్శిగా పనిచేసిన రజత్ కుమార్‌ను కమిషన్ విచారించింది. ఈ కమిషన్ విచారణ వాడీవేడీగా జరిగింది. ఓపెన్ కోర్టు నిర్వహించిన కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్ మొదట రిటైర్డ్ సీఎస్, రిటైర్డ్ ఇరిగేషన్ సెక్రటరీ శైలేంద్ర కుమార్ జోషిని విచారించింది. తుమ్మిడిహట్టి నుంచి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ఎందుకు మార్చారని కమిషన్ ప్రశ్నించగా.. అక్కడ నీటి లభ్యత ఎక్కువ లేదని సీడబ్ల్యూసీ చెప్పిందని జోషి తెలిపారు. ప్రాజెక్ట్ స్థలాన్ని ఎవరు మార్చారని కమిషన్ మరో ప్రశ్న వేయగా.. నాటి సీఎం కేసీఆర్, మంత్రులు నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని జోషి సమాధానం ఇచ్చారు.

దీని పై ఏదైనా కేబినెట్ సబ్ కమిటీ వేశారా అని కమిషన్ అడుగగా.. కేబినెట్ సబ్ కమిటీ ఏమీ లేదని జోషి చెప్పారు. హైపవర్ కమిటీ గురించి కమిషన్ ప్రశ్నించగా.. దాని గురించి తెలియదని జోషి మొదట సమాధానం ఇచ్చారు. అయితే కమిషన్ జీవో చూపించడంతో ఆయన అవునని ఒప్పుకున్నారు. అది టెక్నికల్ కమిటీ



మాత్రమేనని వెల్లడించారు. మహారాష్ట్ర వైపు ముంపు ఎక్కువ ఉండడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ కట్టారని తెలిపారు. కాళేశ్వరం కాంప్లెక్స్ ప్రాజెక్ట్.. 28 ప్యాకేజీలు.. 8 లింకులతో కట్టారన్నారు. ఒక్కసారే అప్రూవల్ లేదని.. వివిధ సమయాల్లో ఆయా ప్యాకేజీలకు దాదాపు 200 అనుమతులు ఇచ్చి ఉంటారని జోషి చెప్పారు. కాగా.. ఈరోజు నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ తిరిగి ప్రారంభమైంది.

ఈ దఫా వారం రోజుల పాటు కమిషన్ విచారించనుంది. ఈసారి కమిషన్ ముందుకు కీలక ఐఏఎస్, మాజీ ఐఏఎస్ అధికారులు హాజరుకానున్నారు. కీలక సోమేశ్ కుమార్, స్మిత సభర్వాల్ తదితరులు కమిషన్ ముందు విచారణకు హాజరుకానున్నారు.

## గరిష్ఠ వాణిజ్య లోటు.. మోదీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించకుండా, చట్ట ప్రకారం జరిగే వ్యాపారాలను పట్టించుకోకుండా, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి (క్రోనీ క్యాపిటలిజం) అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ అవలంభించే ఇటువంటి చర్యల ఫలితంగా దేశంలో తయారీ రంగం బలహీనపడుతోందని, కరెన్సీ విలువ పడిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

రికార్డు స్థాయిలో గరిష్ఠ వాణిజ్య లోటు, అధిక వడ్డీ రేట్లు పెరుగుతాయని తెలిపారు. ఈకారణంగా వస్తువుల వినియోగం తగ్గి ద్రవ్యోల్బణం పెరుగుదల వంటివన్నీ చూస్తామని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. దేశంలో వాణిజ్య లోటు, దిగుమతులు గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నాయని వస్తున్న వార్తా కథనాలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రభుత్వాలు ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలకు ప్రాధాన్యమిస్తే ఇలాకాక ఇంకేం జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. వాణిజ్య మంత్రిత్వశాఖ డేటా ప్రకారం.. నవంబరులో దేశీయ వాణిజ్య ఎగుమతులు ఏడాదిక్రితం ఇదే నెలతో పోలిస్తే 4.85% తగ్గి 32.11 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు 27% పెరిగి రికార్డు స్థాయి 69.95 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్యలోటు 37.84 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇది జీవనకాల గరిష్ఠ స్థాయి. ప్రధానంగా పసిడి దిగుమతులు గణనీయంగా పెరగడం వల్లే, వాణిజ్యలోటు ఇంతగా నమోదైందని వాణిజ్యశాఖ గణాంకాలు వెల్లడించాయి. పసిడి దిగుమతులు గత నెలలో రికార్డు గరిష్ఠమైన 14.86 బిలియన్ డాలర్లకు చేరాయి.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660